క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర



అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న మహిళలు

నంద్యాల(అర్బన్): స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కుందూనది ఒడ్డున వెలసిన గంగమ్మకు జాతర సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంఘం నాయకులు జిల్లెల్ల శ్రీరాములు, రామకృష్ణ, నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 30 కుటుంబాలు పాల్గొని అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.శీను, లింగమూర్తి, జంబులయ్య పాల్గొన్నారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని జగజ్జననీ మాతకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో సారె సమర్పించారు.అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి చీర, సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నరసింహులు

బొమ్మలసత్రం: జిల్లాలో ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ తప్పదని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. పాత నేరస్తులపై నిఘా పెంచడంతో పాటు రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల గుడ్‌షెప్పర్డ్ ప్రైవేటు స్కూల్ గుర్తింపును శాశ్వతంగా రద్దు చేసే చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లాల నేతలు రాజునాయుడు, రామచంద్రుడు, శ్రీరాములు అధికారులను కోరారు. ఆదివారం నంద్యాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్పెషల్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం తదితర వాటి పేరుతో కార్పొరేట్ స్కూళ్లను మించి ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు చంద్రప్ప, వేణుమాధవరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజల అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి హారతులు పట్టారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, చీర,సారె, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో పరిసరాలు కిటకిటలాడాయి.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వడ్డెర కులస్తులను డీపీఏ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని నంద్యాల జిల్లా వడ్డెర సంఘం నాయకుడు చల్లా వెంకటేష్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ గతంలో మంత్రి వర్గం తీర్మానం చేసి పార్లమెంట్ ఆమోదానికి పంపారని గుర్తు చేశారు. ఇంత వరకు పార్లమెంట్‌లో ఆమోదం పొందలేదని, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని బిల్లు ఆమోదం పొందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

వరి సాగుకు సన్నద్ధం

- జోరుగా బోరు బావుల కింద నారు మడులు
- ముందస్తు నాట్లు వేసేందుకు రైతన్నల యత్నాలు
- ఎరువులు, మందులను సమకూర్చుకుంటున్న అన్నదాతలు



చిత్రేనిపల్లె సమీపంలో ట్రాక్టర్‌తో బురద సేద్యం చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలో ముందస్తు వరి పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బోరు బావుల కింద నారుమడులు సిద్ధం చేశారు. అలాగే పొలాల్లో చల్లిన జీలుగలు ఏపుగా పెరుగడంతో ట్రాక్టర్లతో బురద సేద్యం చేస్తున్నారు. పంట సాగుకు తగినట్లుగా అవసరమైన ఎరువులు, నారు నాటేందుకు కూలీలను సమకూర్చుకుంటున్నారు. మండలంలోని ఆలమూరు, చిత్రేనిపల్లె,ముకుందాపురం,హరినగరం, తాండా,డీ.కొట్టాల, అప్పనపల్లె, తిప్పారెడ్డిపల్లె,నర్సాపురం తదితర గ్రామాల్లోని రైతులు దాదాపు 500 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు తమ బోరు బావుల కింద నారుమడులు ఏర్పాటు చేసుకున్నారు. రెండు మూడు రోజులుగా వర్షం కురుస్తుండటం రైతులకు కలిసొచ్చింది. బోరు మోటార్ల నుంచి పొలాలకు నీటి తడులు పారించి బురద సేద్యాలు చేసి మడులను సిద్ధం చేశారు.



చిత్రేనిపల్లె వద్ద సిద్ధంగా నారు మడి



ముకుందాపురం పొలాల్లో పెరుగుతున్న జీలుగ

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. అయితే సచివాలయాల పరిధిలో బాధితులకు న్యాయం జరగకపోతే మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు సమర్పించుకోవాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు దండె దస్తగిరి తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిన్మయ ఎయిడెడ్ స్కూల్ విద్యార్థులకు క్లబ్ సభ్యులు మాలేపాటి రాజశేఖర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం పుస్తకాలు అందజేశారన్నారు. రోటరీ గవర్నర్ శ్రీరామమూర్తి, మోహన్‌రెడ్డి, బాలకృష్ణ, సుధామోహన్‌రెడ్డి, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



హరివరం ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

ఇబ్బందులు తొలిగాయి



గతంలో వర్షం వస్తే రహదారులు సరిగా లేక ఇబ్బందులు పడేవాళ్లం. వర్షపు నీరు, వృథా నీరు బయటకు వెళ్లాలంటే కష్టంగా వుండేది. మా కాలనీలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేశారు. దీంతో ఆ ఇబ్బందులు తొలగాయి.

– సుమలత, గ్రామస్తురాలు, హరివరం

ఉయ్యాలవాడ : సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని హరివరం గ్రామంలో రూ. 58 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి రూ.18 లక్షలు ఎంపీ ల్యాండ్స్ నిధులు ఇవ్వడంతో ఎస్సీ కాలనీలో 500 మీటర్ల పొడువున మురుగు కాలువలు ఏర్పాటు చేశారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ. 20 లక్షలు వ్యయం చేసి ఎస్సీ, బీసీ, ఇతర కాలనీల్లో 1200 మీటర్ల పొడువున సిమెంట్ రోడ్ల పనులు పూర్తి చేసినట్లు పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

గోస్పాడు: మండలంలోని రైతులకు 9గంటల పాటు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు విద్యుత్ ఏఈ జ్ఞాన సూర్యుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ఆదివారం వరకు.. ఏ గ్రూపులో గోస్పాడు సబ్ స్టేషన్ పరిధిలో ఒంటి వెలగల ఫీడర్ కింద యాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఎం.కృష్ణాపురం, యాళ్లూరు ఫీడర్ల కింద, దీబగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో చెన్నూరు, నాగులవరం, దీబగుంట్ల ఫీడర్ల కింద ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అలాగే బి గ్రూపులో గోస్పాడు సబ్‌స్టేషన్ల పరిధిలో ఎం.చింతకుంట్ల ఫీడర్ కింద యాళ్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో సత్యనారాయణాపురం ఫీడర్ కింద, దీబగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో మసీదుపురం, మోతుకుల పల్లె ఫీడర్ల కింద ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో జరుగుతున్న జగనన్న సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. ఆదివారం స్థానిక 23వ వార్డు నూనెపల్లెలో జగనన్న సురక్ష క్యాంపునకు సంబంధించి సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి రుసుము చెల్లించకుండా 11రకాల ధ్రువ పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందున, ప్రభుత్వ పథకాలకు, ఇతర అవసరాలకు అవసరమయ్యే ధ్రువ పత్రాలు సులువుగా పొందాలని కోరారు. కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

గోస్పాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోపని చేసే ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఏపీ జేఏసీ ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకుడు అబ్దుల్ జబ్బార్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో పని చేసే ఒప్పంద అధ్యాపకుల సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని, పది సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒప్పంద అధ్యాపకులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు కోరారు. ఆదివారం మున్సిపల్ టౌన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయాలకు ఐదు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో పని చేస్తున్న ఆయాలకు వెంటనే వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. శ్యామలమ్మ, శారదమ్మ, మేరమ్మ, పద్మావతి, మున్నిసాబేగం, కరీంబేగం పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

శిరివెళ్ల: 37 ఏళ్ల తర్వాత చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. దీంతో నాటి జ్ఞాపకాలను నెవరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఆదివారం గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986– 87 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులు వేమారెడ్డి, మౌలాలి, వెంకటేశ్వర్లు, ఉశేనిరెడ్డి, రవూఫ్, ఈశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. హెచ్‌ఎం బాలనాగిరెడ్డి, టీచర్లు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేగంగా రక్షణగోడ నిర్మాణం



నిర్మాణంలో ఉన్న రక్షణగోడ

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయ రక్షణ గోడ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2017లో సంభవించిన భారీ వర్షాలకు ఆలయ ముందునున్న ధ్వజం, ప్లాట్ ఫారం కూలిపోయింది. భక్తుల విన్నపం మేరకు మాజీ విప్ గంగుల ప్రభాకరరెడ్డి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.దీంతో ఆయన స్పందించి రూ.1.60 కోట్లు మంజూరు చేశారు. దీంతో రక్షణ గోడ నిర్మాణానికి మార్గం సుగమమం అయింది. వక్కిలేరు వాగు నుంచి 45 అడుగల మేర గోడ నిర్మాణం జరగాల్సిండంగా ఇప్పటి వరకు 35 అడుగల గోడ నిర్మాణం పూర్తయ్యింది. నిర్మాణం పూర్తికాగానే నూతన ధ్వజ ప్రతిష్ఠ, స్వామి జయంతి వేడుకలు నిర్వహించాలని ఆలయ ధర్మకర్తలు నిర్ణయించారు.



కలుషితమైన కుందూ నీరు

కుందూ వెంట దుర్వాసన

దొర్నిపాడు: ఇటీవల కుందూ నీటిలోని చేపలు మృత్యువాత పడటంతో తీర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. నది ఎగువ ప్రాంతంలో భారీగా చనిపోవడంతో నీరంతా దుర్వాసన వస్తుంది. దీంతో క్రిష్టిపాడు గ్రామంలోని కుళాయిలకు రెండు రోజుల నుంచి నీటి సరఫరా నిలిపి వేశారు. ఎగువ నుంచి నీరు కిందకు భారీగా వదిలితే నీటిలో కలుషిత శాతం తగ్గుతుందని, అలాగే నిల్వ ఉన్న నీరు దిగువకు పారి దుర్వాసన పోతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎర్రగుడిదిన్నెలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన డబ్ల్యూ. గోవిందిన్నె టీడీపీ వర్గీయులు

రుద్రవరం: దొర్నిపాడు మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాల టీడీపీ వర్గీయులు ఆదివారం ఎర్రగుడిదిన్నెలోని గంగుల నివాసం వద్ద మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దొర్నిపాడు ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా చెంచి రెడ్డి, జాకీర్‌బాషా, రఫీ, కరీముల్లా, పెద్దన్న, డీలర్ కృష్ణారెడ్డి, నరేంద్రయాదవ్ మధు తదితరుల ఆధ్వర్యంలో టీడీపీ వర్గీయులు పెద్దిబోయిన శివప్రసాద్, బోనాల శంకరయ్య, దిబ్బరాజు, శివరామయ్య, చిన్నదిబ్బరాజు, సహదేవుడు, శివనారాయణ, జనార్దన్, మహేష్, సురేష్, భాస్కర్, బాలరాజు, తులసీరాముడు, సానం శ్రీరాములు, శివ, పెద్దశివ, ఉషాకాంత్, మాబాషా, బయన్నగారి చంద్ర, చాంద్‌బాషాలతో పాటు మరో 30 కుటుంబాల వారు ఎర్రగుడిదిన్నెకు చేరుకోగా మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కలిసి వారికి కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. మాజీ విప్ మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న పథకాలకు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరారని చెప్పారు. అందరూ కలిసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ట్రాలీ ఆటోను ఢీకొన్న టిప్పర్

పాణ్యం: మండల పరిధిలోని ఆర్‌జీఎం కళాశాల వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఆదివారం తెలిపారు. వివరాలు.. డోన్ పట్టణానికి చెందిన ఓబులేసు ఇంటి సామాన్ల లోడ్‌తో నంద్యాలకు బయలుదేరారు. ఆర్‌జీఎం కళాశాల వద్ద గేదెలు రోడ్డు దాటుతుండగా మరో టిప్పర్ వెనుక వాహనాన్ని వరుసలో ఉంచారు. ఇంతలో వెనుక వచ్చిన మరో టిప్పర్ ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఓబులేసుకు గాయాలు కావడంతో నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. రెండు వాహనాలను పక్కకు తొలగించారు.

విరాటపర్వం ఎంతో విశిష్టమైనది



హయగ్రీవాచార్యులను సన్మానిస్తున్న పండితులు

మహానంది: అందరికీ మహాభారతం అంటే ఎంతో ఇష్టమని, అందులోనూ భారతంలోని విరాట పర్వం మరింత విశిష్టమైందని నంద్యాలకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు దివి హయగ్రీవాచార్యులు తెలిపారు. మహానంది క్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగిన విరాట పర్వం పారాయణం ఆదివారంతో ముగిసింది. ఈ మేరకు మూడురోజుల పాటు పారాయణం చేసిన ఆయనను ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, అధికారులు సన్మానించారు. స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

మల్లన్నను దర్శించుకున్న సినీనటి రవళి



స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం కుటుంబసభ్యులతో సినీ నటి రవళి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సినీ నటి రవళి ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో శ్రీశైలం వచ్చిన వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఆదిదంపతులకు మేఘాల పందిరి !



పరమేశ్వరుడిని ప్రకృతి సైతం ఆరాధించింది. నీలకంఠుడికి నింగి నీడను పట్టింది. ఆదిదంపతులకు మేఘాలు పందిరి వేశాయి. దీంతో మహానంది అందాలు మహా(ఆ)నందంగా మారాయి. మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివార్ల గర్భాలయ గోపురాలపై ఆదివారం కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరాలో బంధించింది.

– మహానంది

నేరేడు..పోషకాలు మెండు

- ఈ సీజన్‌లో మాత్రమే లభించే అద్భుతమైన ఫలం
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- మార్కెట్లో కిలో ధర రూ.100 – రూ.150



నేరేడు పండ్లను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గోస్పాడు: అద్భుతమైన పోషక విలువలున్న పండుగా నేరేడుకు పేరుంది. కేవలం ఈ సీజన్‌లో మాత్రమే లభించే ఈ పండు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉంది.

ఈ ఫలం జూన్, జూలై నెలల్లో మాత్రమే లభిస్తుంది. వీటిని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, మదనపల్లె తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి చేసుకుంటారు. మార్కెట్లో కిలో పండ్ల ధర రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఆయుర్వేదంలో నేరేడు పండ్లు ఎన్నో ఔషధ గుణాలున్నాయని పేర్కొనబడింది.

ప్రయోజనాలు..

నేరేడు పండ్లలో ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియంతో పాటు విటమిన్‌లు కూడా పుష్కలంగా ఉంటాయి. దీని వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. వీటిలోని యాంటీయాక్సిడెంట్లు కాలేయ పనితీరును మెరుగు పరుస్తాయి. దంత ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. దంతాలను, నోటి చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఉదయ సంబంధ సమస్యలను కూడా తగ్గిస్తాయి. జీర్ణ శక్తిని మెరుగు పరుస్తుంది. షుగర్ వ్యాధి నివారణకు దివ్య ఔషధం, రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పండ్లను ఆరోగ్య పానీయాలు, జాములు, ఐస్ క్రీమ్‌ల తయారీలో వినియోగిస్తారు.

అమ్మకాలు బాగానే ఉన్నాయి



నేరేడు పండ్ల విక్రయాలు బాగానే జరుగుతున్నాయి. పండ్లు తాజా ఉంటే ప్రజలు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తారు. ఇవి ఈ సీజన్‌లో మాత్రమే దొరుకుతాయి. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ప్రస్తుతం కిలో ధర రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నా.

– సద్దాంహుసేన్, వ్యాపారి

మంచి పోషక విలువలు



నేరేడు పండ్లలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. నీరు, ప్రొటీన్లు, కొవ్వులు, కార్బోహైడ్రేట్‌లు, విటమిన్‌లు, మినరల్స్ ఉంటాయి. వీటిని తగు మోతాదులో తీసుకోవాలి. షుగర్ వ్యాధి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతాయి. ఈ సీజన్‌లో వచ్చే సమస్యలకు మంచి పరిష్కారం చూపుతాయి.

–గోపాల్, వైద్యాధికారి, గోస్పాడు

ఓంకారంలో భక్తులసందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని శ్రీ ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కాశినాయన అన్నదాన భవనం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.